
# ఒకరికి ఒకరై...



ఎముకలు కొరుకుతోన్న చలికాలం!

మంచం మీదనుంచి లేస్తూ శరధి గడియారం కేసి చూశాడు.

'అబ్బో... అప్పుడే ఏడుగంటలయిపోయిందే!' అనుకుంటుండగా ఆవలింత ఆవహించింది. అది మామూలుగా లేదు. భారీస్థాయిలో ఉంది. ఆ ఆవలింతకు ఎక్కడో వంటింట్లో ఉన్న అర్ధాంగి కాఫీగ్లాసుతో పరుగెత్తుకొస్తుందనుకున్నాడు.

ఆ దిశగా నిరీక్షించాడు... 'ఉహుఁ..!!' ఆ జాడ కనిపించలేదు.

ఈసారి కావాలనే పెద్దగా ఆవలించాడు.

ఆ చేష్టల్ని గమనించిందేమో... పెళ్ళయిన దగ్గర్నుండీ మొగుణ్ణి పూర్తిగా చదివిన హారతి చటుక్కున ప్రత్యక్షమయింది.

ఆమెవైపు చూశాడు... చేతిలో కాఫీగ్లాసుకు బదులు టిఫిన్ బాక్స్, భుజాన ఆఫీసు బ్యాగులు కన్పించాయి.

మరోసారి పరికించి చూశాడు...

కొన్ని నిమిషాల క్రితంవరకు నైటీలో వున్న హారతి- తెలుపు, నీలంరంగుల మిశ్రమమైన కాటన్‌చీరలో నిండుగా కనిపించింది. అతనికి అప్పుడు అర్థమయింది- ఆమె ఆఫీసుకు వెళుతోందని!

"ఈరోజు మా కార్పొరేట్ అడిట్ ఉంది... ఎర్లీగా వెళుతున్నాను. సాయంత్రం లేటవవచ్చు. ఇంటిపనులు కొంచెం చూసుకోండి!" అంటూ నాలుగే నాలుగు మాటలు ముక్తసరిగా చెప్పి, విసురుగా బయటకు నడిచింది- వాచీ చూసుకుంటూ.

ఎప్పుడూ ఉండే బద్ధకపు అంకానికి అతికష్టం మీద ఫుల్‌స్టాప్ పెట్టి, శరధి వంటింటి వైపు నడిచాడు. గ్యాస్‌స్టవ్ మీద కాగుతున్న వేడినీళ్లలా అతని అంతరంగం మరిగిపోతోంది.

ఒక్కసారి ప్రక్కగదిలోకి తొంగిచూశాడు...

బాబు బబ్లూ, పాప ప్రగతి 'లేద్దామా! వద్దా!!' అనుకుంటూ ప్రక్కమీద దొర్లుతున్నారు.

"బబ్లూ! గెటప్ యార్... కాన్వెంట్‌కి టైమ్ అవుతోంది. వేన్ వాడు ఎక్కువసేపు వెయిట్ చెయ్యడు!"

"అబ్బాఁ... ఆగు డాడీ! రాత్రి మన్మథుడు సినిమా అయ్యేసరికి పదకొండు అయిపోయింది. ఓ అరగంట నిద్రపోనీ!!" అంటూ మరోవైపు ఒరిగాడు.

"పండూ... లే అమ్మా! బంగారుతల్లివి కదూ!!" వాడికన్నా చిన్నపిల్ల అయినా- ఏమనుకుందో... ఠక్కున మంచంమీద నుండి లేచికూర్చుంది ప్రగతి.

"ఉండు డాడీ! వాడి పని చెబుతా!" అంటూ కిచెన్‌లోని ట్యాపు దగ్గర నీళ్లు దోసిట్లో తీసుకొచ్చి వాడి ముఖంమీద చల్లింది.

చిరుకోపంతో బబ్లూ చిన్నగా అరిచాడు. అయినా బాత్రూం వైపు పరుగుతీశాడు.

కూతురు తెలివితేటలకి మురిసిపోతూ స్టౌమీది వేడినీళ్లు బకెట్‌లో పోసి వాళ్ళకిచ్చి, తను కాఫీ తయారుచేయడానికి సిద్ధమయ్యాడు.

ఒకింత పరధ్యానంగా ఉన్నాడేమో- డికాషన్‌ని ఫిల్టర్ చేస్తున్న అతని చేయి వేడిగిన్నెకు తగిలేసరికి "అమ్మా..." అన్నాడు.

'అలవాటు లేని పని... తప్పని పరిస్థితి!' భార్య హారతి మీద ఒక్కసారి ఆగ్రహం ముంచుకొచ్చింది. ఎప్పుడో పొద్దున్నే ఆఫీసుకి వెళ్లే ఆమె- సాయంత్రం ఏడుగంటలకు కాని ఇంటికి చేరదు. దానితో ఇంటిపని, ఒక్కోసారి వంటపని కూడా తానే చేసుకోవలసిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

ఎప్పుడైనా చేయి కాల్చుకోవలసివచ్చిన పరిస్థితులలో నిజంగానే చేతులు కాలేవి. ఉద్యోగం పేరుతో హారతి ఇంటి అటెన్షన్ ఎక్కువ పే చేయలేకపోవడంతో శరధికి సంసార జంఝాటం కాస్త ఎక్కువయిందనే చెప్పాలి.

హారతి ఉద్యోగి కావడంతో తనలో కలిగిన మార్పుకి మొదట్లో వేదన చెందినా, తరువాత స్తిమితపడటం అలవాటయిపోయింది శరధికి.

జీవితాంతం ఒకేవిధంగా ఉండాలనుకోవడం కుదరని పని! ఒడిదొడుకులు కుదిపేస్తున్నా, సమస్యలు పీడిస్తున్నా ఫ్లెక్సిబిలిటీ ధోరణితో ముందుకుసాగడం ముఖ్యం. సర్దుబాటుతనం మనిషికి చాలా అవసరం.

పిల్లలకు కేరియర్ రెడీ చేస్తున్న శరధికి 'నిర్మల' గుర్తుకొచ్చింది. నిర్మలమైన వ్యక్తిత్వంతో అలరారే నిర్మల సాంగత్యంలో తన రోజులు అప్పుడు ఎంత నిర్మలంగా ముందుకు సాగిపోయేవి!

ఆ ఊహ మనసులో మెదలగానే హృదయం ఒక్కసారి బరువెక్కినట్లయింది. ఘనీభవించిన ఆ జ్ఞాపకాలన్నీ ఆమె చుట్టూ తిరగడం మొదలుపెట్టాయి.

●

"ఏమండోయ్‌ః... శ్రీవారూ! పేపరువాడు ఇచ్చి వెళ్లాడు... పాలవాడు పోసి పోయాడు... పనిమనిషి చేసిపోయింది... ఇక తమరు లేచి అనుగ్రహించడమే తరువాయి!"

- అంటూ నిర్మల మేలుకొలుపు శరధికి రోజూ ఊపిరిలాడుతుండేవి.

ఆమె పెద్దగా చదువుకోకపోయినా భావుకతతో మాట్లాడే ఆ మాటలలో రోజూ ఏదో కొత్తదనం వ్యక్తమయ్యేది. దుప్పటి ముసుగులోంచి ముఖాన్ని బయటికి పెట్టేసరికి మహాలక్ష్మిలా స్వాగతం పలికేది. ఇక ఆరోజు అన్నీ శుభాలే!

ఓరోజు "కాఫీ..." శరధి మురిపెంగా అడిగాడు ఎప్పటిలాగే.

"తెచ్చాను స్వామీ... అదిగో!" అంటూ టేబుల్ మీద కప్పు చూపించింది.

"ఏమిటోయ్‌ః... ఈరోజు కొత్తగా కనపడుతున్నావ్?!" కాఫీ సిప్ చేస్తూ అడిగాడు.

"అది రోజూ అనే మాటేగా!" పైటతో ముఖంమీది చిరుచెమటని తుడుచుకుంటూ అంది.

'నిజం... ఏమిటో కొట్టొచ్చే ఆ కొత్తదనం?" కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నాడు.

"......................"

"చెమటతో కరిగిపోతున్న కుంకుమ... దాని రంగు అనురాగం!"

"అందమైన మనసును కంటితో కలగలిపి చూసేవాళ్ళకి అలా అనిపిస్తుంది లెండి!" వంటింటిలో పనుల్ని మధ్యలో ఆపివచ్చినా- మొగుణ్ణి ఆనందపరచాలనే ఉద్దేశంతో ఆ కొంచెం సమయమైనా తీసుకొని మాట్లాడింది.

"యస్ నిర్మలా... నీ అందం అంతా నీ మాటల్లోనే ఉందనుకో..!"

"ఆఫీసుకు ఎగనామం పెడతానంటే ఇంట్లో కూర్చోపెట్టి ఇలాగే వాగుతుంటాను..."

"పెట్టమంటే నాకేం అభ్యంతరం లేదు. ఈరోజు ఆఫీసులో బిజీవర్క్ వుంది. అయినా అవన్నీ నీ తర్వాతే..!"

"మహానుభావా... అంత పనీ చేస్తారు! త్వరగా తెమలండి... టైమవుతోంది!"

"చెప్పనే లేదు... ఉదయాన్నే ఏమిటీ కొత్త అందం..?"

"ఏముందీ... తలారా స్నానం చేశానంతే!"

"అద్సరే లేవోయ్ఁ... ఏదో విశేషముండాలిగా!"

"ఈరోజు రథసప్తమి..!"

"ఓహోఁ... సూర్యభగవానుడి పండుగన్న మాట!" దగ్గరగా లాక్కుంటూ అన్నాడు.

"ఏ పండుగయినా భర్త భగవానుడి తర్వాతే కానీ, సూర్యుని విషయంలో కొంచెం నియమం!"

"ఫర్వాలేదు లేవోయ్ఁ..." మరింత దగ్గరగా తీసుకోబోయాడు.

"చాల్లే వదలండి... బబ్లూ పెరట్లో ఉన్నాడు!" నిర్మల వంకపెట్టింది.

"ఉంటే ఉండనీ... చూస్తే చూడనీ..."

"అంతేనన్న మాట... ఆలోచనా, పాలోచనా ఉండొద్దూ..?"

"ఆలోచన దేనికి? అయినా ఏమనుకుంటాడు?"

"పండగ పూట మమ్మీని డాడి కౌగిలించుకుంటున్నాడు అనుకోడూ..?! అనుకున్నా ఫరవాలేదు. కానీ..."

"మరి, భయం దేనికో..?!"

"కడుపులో పాప అనుకుంటుందని!" సిగ్గుతో తలదించుకొంటూ అంది.

"అది నా కూతురే లేవోయ్ఁ... మన నాన్నే కదాని ఎక్స్క్యూజ్ చేసేస్తుంది!"

ఇంతలో బబ్లూ వీధిలోకి పరిగెత్తాడు.

నిర్మల అతని గుండెల మీద వాలిపోయింది. అనురాగ గంగ ప్రవహించినట్లుంది శరధికి.

"ఈరోజు కొంచెం కంగారుపడకండి... నియమంగా ఉండాలి!"

"అద్సరే నిర్మలా! మొన్నటిదాకా బెడ్‌కాఫీ కుదరదని మారాం చేసేదానివి- ఏమిటీ... ఈమధ్య ఇంత మంచిదానివైపోయావు?"

"నా అభిప్రాయాల్ని అంతగా మీమీద రుద్దడం ఎందుకో బాగాలేదనిపించింది. మీ ఇష్టం... మీ ఆనందాన్ని గౌరవించాలనుకున్నాను."

"అంటే..?"

"మీకు మొదటినుండీ బెడ్‌కాఫీ అలవాటు! మధ్యలో వచ్చిన నేను మీ ఆనందాన్ని కాదనడం ఇష్టం లేక!"

"మరి, మరో అలవాటుంటే... దాన్నీ మన్నిస్తావా?"

"అమ్మో..." అంటూ ముక్కున వేలేసుకుంది.

నిర్మల మాటలు మధురంగా అన్పించాయి శరధికి.

శరధికి ఒక ట్రాన్స్‌పోర్టు కంపెనీలో గుమాస్తా ఉద్యోగం! నెలనెలా వచ్చే మూడువేల రూపాయల జీతం అతన్ని ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉంచుతోంది. భార్య నిర్మల హౌస్‌వైఫ్!

అతని మనసెరిగి నడుచుకొనే ఇల్లాలు కావడంతో శరధి ఆర్థిక స్థితి ఆమెకు ఎప్పుడూ కష్టం కల్గించలేదు. ఉన్నదానిలోనే సంతోషం వెదుక్కొనేది.

భర్త కొనితెచ్చిన వంద రూపాయల సాదాచీర ఆమె మనసుకి పదివేల రూపాయల పట్టుచీరెలా అనిపిస్తుంది. ఎప్పుడు ముఖాన నవ్వు పులుముకొని ఆనందపు గులాబీలు పూయించే నిర్మల అంటే శరధికి చెప్పలేని ఆనందం. ఆమె సాహచర్యంలో నిత్యం ఎన్నో వసంత పరిమళాల్ని ఆఘ్రాణించేవాడు. వారి ప్రేమకు ప్రతిరూపమే కొడుకు బబ్లూ.

రోజూ ఉదయాన్నే బెడ్‌కాఫీ ఇవ్వడం దగ్గర నుండి, బ్రష్ మీద పేస్ట్ వేసి అందివ్వడం, స్నానానికి వేడినీళ్లు పెట్టడం, తలకు నూనె రాయడం, ఇస్త్రీ చేసిన బట్టల్ని బీరువాలోంచి తీసి అందివ్వడం, కేరియర్ సర్ది ఇవ్వడం, నవ్వుతో ఎదురొచ్చి ఆఫీసుకు పంపడం, సాయంత్రం ఆఫీసు నుండి రాగానే సాదరంగా పలకరించడం, టీ ఇచ్చి ఉత్సాహపరచడం, స్నానం అయిన తరువాత వేడిగా అన్నం వడ్డించడం వరకూ అన్నీ తనే చూసుకొనేది.

మొత్తానికి ఆమె సాహచర్యం శరధికి మత్తుగానూ, గమ్మత్తుగానూ ఉండేది. ఆలోచిస్తే 'ఇటువంటి ఆడవాళ్ళు ఈ కాలంలో ఉన్నారా..?' అన్పించేది అతనికి.

ఆరోజు నిర్మల దూరపుబంధువు ఒకావిడ చుట్టపుచూపుగా వచ్చింది!

బయట బాగా వర్షం పడుతోంది...

"ఆయన గొడుగు తీసుకెళ్లలేదు... వర్షంలో తడుస్తూ ఎలా వస్తారో, ఏమిటో..?!" తనలో తనే అనుకుంటూ మధనపడింది నిర్మల.

"వస్తాడులే అమ్మాయీ! అంత కంగారు దేనికి చెప్పు... అల్లుడు ఏమీ చిన్నోడు కాదుగా?!"

"అదికాదు పిన్నీ! వర్షం వస్తుందని తెలిస్తే ముందుగా తీసుకెళ్లేవారు. కానీ, దిక్కుమాలిన వర్షం చెప్పకుండా దాపురించింది. ఎవరైనా కనిపిస్తే బాగుండును.." రోడ్డువైపు చూస్తూ అంది.

"తడిసినా ఒక పూటకు ఏమీ ఫరవాలేదు లేవే... అంత గాబరాపడకు!"

"నీకు తెలియదులే..." అంటుండగా– శరధి ఆఫీసులో పనిచేసే మరొక ఆయన కన్పించడంతో భర్తకు అందజేమయని గొడుగు ఇచ్చి పంపించింది.

"అదేమిటే నిర్మలా... అంత కలత చెందుతావు? వర్షం వస్తుంది, తగ్గుతుంది... తగ్గిన తరువాత వస్తాడుగా!"

"అదికాదు పిన్నీ..."

"ఏది కాదు చెప్పు? ఉదయం నుంచి చూస్తున్నా– బెడ్ కాఫీ ఇవ్వాలి... పేస్ట్‌ని బ్రష్ మీద వేసి మొగుడికి అందించాలి... స్నానానికి నీళ్లు పెట్టాలి... తరువాత టిఫిన్... డ్రస్సు... కాలికి బూట్లు అందివ్వడాలు... ఎదురెళ్లి ఆఫీసుకు పంపడాలు... మొత్తానికి నువ్వు చాలా మరీ పాతకాలం అవతారంలా ఉన్నావే!"

"అవేమీ తప్పు కాదుగా పిన్నీ!"

"తప్పు కాకపోవడమేమిటే... ఇంట్లో మొగుడికి సౌకర్యాలు కల్పించడమే తప్పు సాధించడం నేర్చుకోకపోతే తాను సాధించడం నేర్చుకుంటాడు. చివరికి 'పెళ్ళాం చేత సేవలు చేయించుకోవడం తన జన్మహక్కు' అంటూ దేనికైనా సిద్ధపడతాడు..."

"......................."

"అతనూ మనిషే... నువ్వూ మనిషివే! అంటే... ఎవరి పనులు వాళ్ళు చేసుకోవాలని నా ఉద్దేశం. దానికీ కొన్ని పరిధులు లేవు..."

నిర్మల ఏమో చెప్పబోయింది.

"ఏమోనే అమ్మాయీ! నీ పద్ధతి నాకేమీ నచ్చలేదు. రేపు పుట్టిన పిల్లలు పెద్దవాళ్ళవుతారు. అప్పుడు అంతమందిని ఎలా చూసుకోగలవు చెప్పు?"

"పోనీ... అప్పుడు నువ్వే సాయం వద్దువు గానీలే..!"

"సరేలే... నా మాటలు నీకిప్పుడు అర్థంకావు. రానురాను తెలుస్తుంది!"

"అయ్యో! పక్కింటి బాబాయిగారి చేత గొడుగు పంపించానేం... అలా తడుస్తూ రాకపోతే కొంచెం చూసుకురావచ్చుగా!!" అప్పుడే ఆఫీసునుండి వస్తున్న శరధిని ఉద్దేశించి ఆతృతగా అంది నిర్మల.

"కొంతవరకు మా ఆఫీసు జీప్‌లోనే వచ్చాను. ఇక్కడే తడిసింది!" అన్నాడు జేబులోంచి కర్చీఫ్ తీసుకుని తుడుచుకుంటూ.

"అబ్బాం... ఉండండీ... టవల్ తీసుకొస్తాను!" చివాలున లేచి లోపలికి పరుగుతీసింది.

నిర్మలను చూస్తే వింతగా ఉంది ఆ అతిథికి.

'ఏమిటీ... ఇది ఈ కాలపు పిల్లలా లేదు. నా కోడలు మొగుణ్ణి పట్టించుకోదు సరికదా- నావంక అసలే చూడదు!' అనుకోసాగింది తనలో తాను.

మొగుడు తడిచివస్తే బూట్లు, సాక్సు తీసి, షర్టు తీయించి తల తుడవసాగింది.

"అత్తగారూ! నిర్మల ఉంది చూశారూ... ఈ ఇంటి దేవత! ఆమె సపర్యలతో ఆఫీసులో చికాకులెన్ని ఉన్నా ఇంటికొచ్చేసరికి ఇట్టే ఎగిరిపోతాయనుకోండి..."

'అవును! బండచాకిరీ అంతా చేయించుకొని, పైకి నాలుగు మంచిమాటలు చెప్పడం మీకు అలవాటేగా!' అనుకోసాగింది ఆ ముసలావిడ.

"పిన్నీ! చేసేది గుమాస్తా ఉద్యోగమైనా, వచ్చేది కొంచెం జీతమైనా, ఉండేది చిన్నకొంపలోనైనా ఈయన మగలోకానికి మారాజు!"

ఆ పెద్దావిడ తనలో తానే నవ్వుకొంది నిర్మల ధోరణికి.

పెళ్ళాం తల తుడుస్తుంటే హాయిని పొందుతున్న శరధికి ఆమె మాటలు అమృతంగా తోచాయి. ఒక్కుదుటున దగ్గరకు లాక్కోవాలనుకున్నాడు. కానీ, మూడోమనిషి ఎదురుగా ఉండడంతో బాగుండదనిపించింది.

బబ్లూ పుట్టిన రెండు సంవత్సరాలకి నిర్మల మళ్ళీ గర్భం ధరించింది.

శరధి ఆనందానికి అవధులు లేవు. భార్యను పువ్వుల్లో పెట్టి చూసుకోసాగాడు.

ఈసారి విధి వక్రించింది...

రెండో కాన్పు కష్టమయింది!

డెలివరీ టైములో బిడ్డ అడ్డంతిరగడంతో ఆపరేషన్ చేయించవలసివచ్చింది. దురదృష్టవశాత్తు ఒక ఆడపిల్లకు ఊపిరిపోసి తాను ఊపిరి విడిచింది నిర్మల.

తల్లడిల్లిపోయాడు శరధి.

బ్రతుకంతా శూన్యంగా అనిపించసాగింది.

ఇద్దరు పసిపిల్లల ఆలనాపాలనా చూడటానికి ఆడదిక్కు అవసరమైంది...

ఆ ఇంటిలో ప్రేమను పంచి ఇచ్చిన నిర్మల స్థానంలో మరొకామె అనివార్యమయింది.

●

తనవాళ్ళు చూసి చాయపట్టిన హారతిని పెళ్ళి చేసుకున్నాడు.

హారతి ఒక పేరుమోసిన కంపెనీలో టైపిస్టుగా పనిచేస్తోంది. నిర్మలకు, హారతికి వ్యక్తిత్వాలలో చాలా వైరుధ్యముంది.

నిర్మల భర్తచాటు భార్య అయితే- హారతి ప్రాక్టికల్ టైపు లేడీ!

తనూ, తన ఉద్యోగం, భర్త, భర్త ఉద్యోగం, ఇంట్లో పిల్లలూ... వాళ్ళ చదువులు, ఎవరికివారు వారి వారి పనులు చేసుకుంటూ ముందుకు సాగిపోవాలనుకుంటుంది.

ఇంటిపనుల్లోనూ, బయట పనుల్లోనూ ఒకరికొకరు సహకరించుకుంటూ సహజీవనం చేయాలనుకోనే హారతి అభిప్రాయాలతో శరధి ఏకీభవించలేకపోయాడు. నిర్మల ఇంటిసేవలకు బాగా అలవాటుపడ్డ అతన్ని అవన్నీ అడ్డుకట్ట వేస్తున్నాయి.

ఒక హౌస్‌వైఫ్‌కీ, వర్కింగ్ వైఫ్‌కీ ఉన్న వ్యత్యాసం అతనికి అర్థమవుతోంది.

నిర్మల- భర్త, పిల్లల ఆలనాపాలనా అన్నీ దగ్గరుండి చూసుకోవడం, మొగుడు ఇంటికి రాగానే ఆదరంగా పలకరించడం లాంటివి అతన్ని అమితంగా ఆకర్షించేవి.

కానీ, హారతి- నిర్మల స్థానంలో వచ్చిన తరువాత పరిస్థితిలో మార్పు వచ్చింది. పాశ్చాత్య పోకడలు పెద్దగా ఆమెలో లేవు. పిల్లలిద్దరూ తాను కన్నవారు కాకపోయినా బాగానే చూస్తోంది.

చదువుకోమని ప్రోత్సహించి, అర్థంకాని పాఠాలు వివరంగా చెబుతూనే వుంది. అన్నీ బాగానేవున్నాయి. కానీ, ఉదయాన్నే నిద్రలేచినపుడు అంతా హడావిడి కమ్ముకొనేది. ఆదరాబాదరాగా వంట చేయడం... ఒక్కోసారి తొందరగా వెళ్ళవలసిరావడంతో చేయలేకపోవడం, భర్తకు కొన్ని ఇంటిపనులు అదనంగా అప్పగించటం... ఇవన్నీ ఇబ్బందిగా అనిపించేవి.

దానితో వారిద్దరి మధ్య కంటి కగుపించని ఉదాసీనత పొడసూపసాగింది.

నిర్మల తోటి అనుబంధం... మనసా, వాచా పెనవేసుకున్న మమతల మల్లెపందిరి... అర్థాంతరంగా తనను వదలి పైలోకాలకు వెళ్ళిపోయిన వైనం... తరువాత హారతిని పెండ్లి చేసుకోవడం... ఆమె వర్కింగ్ ఉమన్ కావడం... దానితో ఆమె, ఆమె ఆఫీస్, ఆమె లోకం, ఆఫీసు పనుల వలన అంతగా తనతో ఇమడలేకపోవడం... వంటివి వరుసగా కళ్ళముందు కదలడంతో ఎంతో నిరాశకు గురవుతున్నాడు శరధి.

ఒకటి రెండుసార్లు ఆఫీసు పని నుండి ఆలస్యంగా వచ్చింది హారతి!

"హారూ! ఆడదానివి... అంత కష్టపడి బయటకువెళ్ళి ఉద్యోగం చేసిరావాలా చెప్పు? ఇంటిపట్టున వేళకు ఇంత తిని కాలక్షేపం చేస్తే పోలా?!" కాఫీ ఉన్న ఫ్లాస్క్ నందిస్తూ అన్నాడు.

మొదట్లో పెద్దగా పట్టించుకోలేదు గానీ, క్రమంగా భర్త అంతరంగం అర్థమవసాగింది హారతికి. ఒకసారి నొచ్చుకుంటూ...

"చూడండీ! చేసే ఉద్యోగానికి రిజైన్ చేయడం పెద్ద విశేషమేమీ కాదు. మనం ఎప్పుడు మానెయ్యాలనుకుంటే అప్పుడే మానేయొచ్చు. మొదట్లో పెద్దగా చేయకపోయినా వచ్చిందని సరదాగా

చేశాను. ఆ తరువాత హాబీ అనుకుని మురిసిపోయాను. క్రమంగా అమ్మానాన్నల్ని నెలనెలా జీతం డబ్బులతో ఆదుకుంటున్నానని పొంగిపోయాను. ఇప్పుడు భర్తకు సహాయపడడం అదృష్టంగా భావిస్తున్నాను. మీ మనసులో నాచేత ఉద్యోగం చేయించకూడదనే ఉద్దేశమే ఉంటే ఈ క్షణమే గుడ్‌బై చెప్పేస్తాను... ఆలోచించి విషయం చెప్పండి!" రాత్రి మంచంమీద పడుకున్న భర్తతో కాస్త అసహనంగానే అంది.

ఆలోచిస్తుంటే నిద్రపట్టడం లేదు శరధికి.

దూరాన మంచంమీద బబ్లూ, ప్రగతి హాయిగా నిద్రపోతున్నారు. అవును... వారిద్దరూ చక్కగా చదువుకొని, హాయిగా నిద్రపోతున్నారు. ఇప్పుడు తనకు ఎన్నో ఇయర్లీ ఇంక్రిమెంట్స్ కలిపినా మూడువేల ఐదువందల రూపాయలు కూడా పూర్తి జీతం లేదు. సర్వైవల్ కోసం స్ట్రగులయ్యే తను- పిల్లలకు పెద్దపెద్ద ఫీజులు కట్టి చదివించగలడా?! మంచి బట్టలు, ఇతర సౌకర్యాలు కల్పించగలడా?!

హారతి తన జీవితంలో ప్రవేశించిన తరువాత తన కుటుంబ ఆర్థిక పరిస్థితి కొంత మెరుగుపడిన మాట వాస్తవం. నిర్మల బ్రతికివున్న కాలంలో పిల్లలు పసివారు కావడంతో డబ్బుకు అంత అవసరం కనిపించలేదు. కానీ, సంవత్సరాలు గడిచేకొద్దీ తన జీతం పెద్దగా పెరగలేదు కానీ, కన్నపిల్లలు పెరిగి చదువులకొచ్చారు. కుటుంబం పెరిగేకొద్దీ అవసరాలు, సమస్యలు అధికమయ్యాయి.

హారతికి వాళ్ళు కన్నపిల్లలు కాకపోయినా బాగానే పెంచిపోషిస్తోంది. అటువంటి ఆమెను మరో కోణంలో చూడడం ఎంతవరకు సబబు?

నిర్మల లాంటి మృదువైన జీవితాన్ని ఇవ్వడానికి రాజీనామాకి సైతం సిద్ధపడుతోంది హారతి. జీవితాంతం మనిషి ఒకేలా ఉండాలని కోరుకోవడం ఎంతవరకు సహేతుకం?

పరిస్థితులను బట్టి ఎడ్జెస్ట్‌మెంట్ అలవరచుకొని తను మారుతుండాలి. లేకపోతే సమస్యలు భూతాలై వెన్నంటుతాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే... ఆవిడ మానసికమైన సపోర్ట్ ఇస్తే- ఈవిడ ఆర్థికపరమైన సపోర్ట్ ఇస్తోంది.

"ఏవండీ! మీ బట్టలు కుట్టడానికి క్లాసిక్ టైలర్‌కి ఇచ్చాను. స్టిచ్చింగ్ అయిన తరువాత డెలివరీకి వారంరోజులు పడుతుందన్నాడు. మా ఆఫీసు ప్రక్కనే కాబట్టి నేను తీసుకొస్తాను" అటువంటి ఎన్నో మగపనుల్ని హారతి చేస్తూండటం చూస్తుంటే మనసు ఆర్ద్రతతో నిండిపోయింది శరధికి.

రాత్రి అంతా కంటి మీద కునుకు లేని శరధికి అదే భావన మనసులో మారుమ్రోగసాగింది. నెమ్మదిగా నిర్మల తోటి పంచుకున్న అనుభూతుల నుండి మనసు వేరు అవసాగింది. కాలానుగుణంగా మారమని పదేపదే ఘోషిస్తోంది.

హారతి ఆ ఉదయం "ఏమండీ! మా ఎమ్.డి.గారు మార్నింగ్ ఫ్లైట్‌కి ఢిల్లీ వెళుతున్నారు. నేను వెళ్ళి ఒక ఇంపార్టెంట్ ఫైల్ అందించవలసి వుంది..." అంది ముక్తసరిగా.

పనిని అప్పగించే మాటలేవీ ఆమె నోటిలోంచి ఆ ఉదయం రాకపోవడం గమనార్హం.

అది శరధి గ్రహించాడు.

"దానికేం... తప్పకుండా వెళ్లు! ఇంట్లో విషయాలు నేను చూసుకుంటాగా!" పరిస్థితుల కనుగుణంగా తనను తాను మలచుకొంటూ మాట్లాడాడు శరధి. దీనికి పునాది రాత్రే తన మనసులో పడింది.

ఆమె వెళ్లేటప్పుడు కాఫీకప్పును భర్త చేతిలో పెడుతూ ఒక స్వీట్‌లుక్ విలక్షణంగా విసిరి రోడ్డు మీదకొచ్చి ఆటో ఎక్కింది.

శరధిలో కూడా ఏదో తృప్తి కనిపించింది. అతను వంటింట్లోకెళ్లి స్టౌ మీద కుక్కర్ దింపబోయాడు. చేయి తగిలి చురుక్కుమంది.

చూసుకుంటే బొబ్బ కనిపించింది. అయినా ఈసారి మనసు చివుక్కుమనలేదు. అప్పటి నిర్మల పరిస్థితి వేరు... ఇప్పటి హారతి పరిస్థితి వేరు! ఆమె అప్పుడు కేవలం హౌస్‌వైఫ్! ఈమెకిప్పుడు అదొక్కటే పాత్ర కాదు... ఉద్యోగిని కూడా.

అయినా... ఒకరికి ఒకరు తోడ్పడటంలో తప్పేమిటనిపించింది.

ఆ దిశగా అతని అడుగులు పడ్డాయి.

'రమ్యభారతి' మాసపత్రిక . . . ఫిబ్రవరి - ఏప్రిల్' 2005

కథా నిలయం
శ్రీకాకుళం

తమ పుస్తకాలను పుస్తకరూపంలోకి తీసుకురావాలన్న ఆసక్తి, అభిలాష
ఉండికూడా ప్రచురణకి అయ్యే ఖర్చుని చూసి వెనుకంజ వేస్తున్న
వర్ధమాన, అనుభవజ్ఞులైన రచయితలకు ప్రచురణ వ్యయంలో వెసులుబాటును కల్పిస్తూ...

జయంతి పబ్లికేషన్స్

రూపొందించిన ప్రచురణ విధానాల గురించిన పూర్తి వివరాల కోసం
మా అడ్రసుకి వ్రాసి ఉచితంగా పొందండి.